
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
గురువారం 11 డిసెంబరు 2025



ఓటు వేసేందుకు సిబ్బందికి సెలవు ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు విడతల్లో ఈనెల 11, 14, 17 తేదీల్లో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి సెలవు ఇవ్వాలని ఉప కార్మిక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా యజమానులు ఈ నిబంధనను ఉల్లంఘిస్తే దుకాణాలు, సంస్థల చట్టం 1988 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



కరీంనగర్ రూరల్ మండల కార్యాలయ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ లో పోలింగ్ సిబ్బంది

బ్యాలెట్ బాక్సులతో గ్రామాలకు తరలివెళ్తున్న మహిళా సిబ్బంది

తొలి విడత ఎన్నికలు నేడే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల్లోని 91 గ్రామ పంచాయతీల్లోని 89 సర్పంచ్, 590 వార్డులకు గురువారం పోలింగ్ జరుగనున్నది. ఈ విడతలో ఎన్నికలు నిర్వహించేందుకు 858 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చొప్పదండి, గంగాధర, రామడుగు, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ బాక్సులను, బ్యాలెట్ పేపర్లను, ఇతర సామాగ్రిని సిబ్బంది పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు బుధవారం తరలించారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు పీవో, ఏపీవోలతోపాటు ఇద్దరు క్లరికల్ సిబ్బంది, మొత్తం 2,424 మంది సిబ్బందిని నియమించారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం వీల్ చైర్లను అందుబాటులో ఉంచారు. ఎన్ని కలు ప్రశాంతంగా జరిగేందుకు 782 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


బ్యాలెట్ పేపర్లను పరిశీలిస్తున్న అధికారులు

● పలు గ్రామాల్లో మోడల్ పోలింగ్ స్టేషన్లు

ఓటర్లను ఆకట్టుకునే రీతిలో మోడల్ గ్రీన్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించారు. ఈ మేరకు పలు చోట్ల మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటరు స్లిప్‌తోపాటు ఆధార్‌కార్డు, ఓటరు ఐడీ లేదా ఏదైనా గుర్తింపుకార్డులను వెంట తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

● ఎన్నికలు జరిగే మండలాలు

తొలి విడత జరిగే ఐదు మండలాల్లో 92 గ్రామ పంచాయతీల్లో ఒక గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డుసభ్యులు ఏకగ్రీవం కావడంతో 91 పంచాయతీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం ముగ్గురు సర్పంచులతోపాటు 276 వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిగతా 89 సర్పంచు పదవులకు 338 మంది, 590 వార్డు సభ్యుల పదవులకు 1762 మంది పోటీపడుతున్నారు

- గంగాధర మండలంలోని (మిగతా 8వ పేజీలో)

తొలి విడతకు పటిష్ట భద్రత

- విజయోత్సవ ర్యాలీలపై నిషేధం
- ఐదు మండలాల్లో రిపీటర్, బేస్ సెట్ల ఏర్పాటు
- సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. కమిషనరేట్ కేంద్రంలో పోలీసు ఉన్నతాధికారులతో సీపీ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సీపీ ఎన్నికల బందోబస్తు ప్రణాళిక వివరాలను మీడియాకు వెల్లడించారు. సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించడంతో పాటు, వెబ్ కాస్టింగ్ లేదా మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో స్టాటిక్ పోలీస్ పార్టీ, ప్రతి మార్గంలో రూట్ మొబైల్ పార్టీ ఉండేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఎన్నికలు జరిగే ప్రతి మండలానికి ఒక ఏసీపీ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారి ఆధీనంలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను కేటాయించామన్నారు. ఈ ఫోర్స్‌లో స్పెషల్ యాక్షన్ టీమ్ పోలీసులు పూర్తిస్థాయి రైట్ గేర్‌తో సిద్ధంగా ఉంటారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో వంద మీటర్ల వరకు ప్రచారం, పార్టీ చిహ్నాలు, గుంపులుగా గుమికూడి ఉండడం నిషేధమని చెప్పారు. పోలింగ్ స్టేషన్‌లోకి మొబైల్ ఫోన్లు, ప్రచార సామగ్రి అనుమతించమని తెలిపారు. మొదటి విడత ఎన్నికల బందోబస్తు కోసం 782 మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు. సమాచారం వేగంగా చేరవేసేందుకు ఐదు మండలాల్లో అదనంగా రిపీటర్, బేస్ సెట్లను ఏర్పాటు చేసి, వైర్ లెస్ కమ్యూనికేషన్‌ను సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ గౌస్‌ఆలం

డంపింగ్ యార్డులో మంటల నియంత్రణకు శాశ్వత చర్యలు

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డంపింగ్ యార్డులో తరచూ మంటలు చెలరేగుతున్నందున వాటిని నియంత్రించేందుకు శాశ్వతంగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. బుధవారం ఆయన దంపుయార్డును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ మంటలు చెలరేగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మంటలు చెలరేగిన వెంటనే ఆర్పేయాలని, ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తగా ఉండాలని సిబ్బ ందిని ఆదేశించారు.

ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి


సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో పని చేసే ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్యోగుల నుంచి బుధవారం సంతకాలు సేకరించి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1986లో ఏర్పాటు చేసిన వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఏ అతీఖ్, ప్రధాన కార్యదర్శి ఏ దేవరాజ్, జగన్, లహరి, రమ, శ్యామల, నర్సయ్య, స్వామి, మతీన్ పాల్గొన్నారు.


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

పోలింగ్ ఏజెంట్లే కీలకం...

- గ్రామ ఓటర్లనే నియమించుకోవాలి
- వార్డుల్లో వార్డు ఓటరే ఉండాలి

6



సామాజిక సమీకరణాలపై అభ్యర్థుల చూపు

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు సామాజిక వర్గాల వారీగా మద్దతు కూడగడుతున్నారు. పోలింగ్ బూత్ స్థాయిలోనే ఓటర్లను సామాజిక వర్గాల వారీగా గుర్తించి వారి కుల పెద్దలను రహస్యంగా సంప్రదిస్తున్నారు. సమయం చిక్కినప్పుడు అభ్యర్థులు ఫోన్లలో అప్యాయంగా పలకరిస్తూ గెలుపు కోసం సహకరించాలని కోరుతు న్నారు. ఎన్నికల సమయంలోనే సమస్యల పరిష్కారానికి పునాది రాయి పడాలనే ముందు చూపుతో అన్ని సామాజిక వర్గాలు వ్యవహరిస్తున్నాయి. దీంతో పంచాయతీ ఎన్నికల్లో కులం ఓట్లు కీలకంగా మారుతున్నాయి. వార్డుల వారీగా ఎక్కువ ప్రాబల్యంఉన్న కులం ఓట్లను పరిగణనలోకి తీసుకుంటున్న అభ్యర్థులు ఆ సామాజిక వర్గాలను ఆకట్టుకునేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ఆయా కుల సంఘాల్లో జిల్లా స్థాయి పదవులు ఉన్న వారిని మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.



● ఇరువైపులా వారే...

అభ్యర్థులకు ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో, ఎవరిని దూరంగా ఉంచాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఓ అభ్యర్థికి మద్దతుగా కనిపిస్తున్న వ్యక్తులు చీకటికాగానే మరో అభ్యర్థికి మద్దతుగా వాడల్లో కలియ తిరుగుతున్నారు. తమకే ఓట్లు వేయిస్తామని వారు నమ్మబలుకుతున్నారు.

కొత్త పుంతలు తొక్కుతున్న ప్రచారం

- ఒకరికి మించి ఒకరు



సైదాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు కొన్ని గ్రామాల్లో ఏకంగా మేనిఫేస్టో విడుదల చేస్తున్నారు. ఆ మేనిఫెస్టోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ ప్రచారం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో అభ్యర్థులు మేనిఫెస్టోలు విడుదల చేయడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వెన్నంపల్లి గ్రామంలో ఓ అభ్యర్థి 15 హామీలతో మేనిఫేస్టో విడుదల చేశాడు. జాగీర్‌పల్లి గ్రామంలో ఓ అభ్యర్థి తనను గెలిపిస్తే ప్రతీ బతుకమ్మ పండుగకు తన సొంత ఖర్చులతో మహిళలకు చీరలు పంపిణీ చేస్తానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఒక్కో గ్రామంలో ఒక్కో సమస్య తీసుకొని ఆ సమస్య తీర్చుతామని హామీలు ఇస్తున్నారు.

- భర్తల గెలుపు కోసం భార్యల ప్రచారం
- పల్లెల్లో పంపకాలు.. ప్రమాణాలు
- జోరందుకుంటున్న అభ్యర్థుల ప్రచారం



ఒట్టేయండి.. ఓటేస్తానని..

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో డబ్బు, మద్యం పంపకాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఓట్ల కోసం బరిలో ఉన్న అభ్యర్థులు నానా తంటాలు పడుతున్నారు. నామినేషన్లు వేసినప్పటి నుంచి గ్రామాల్లో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వార్డుల వారీగా విభజించుకొని ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఒట్టేసి.. ఓటేయాలంటూ వేడుకుంటున్నారు. ఎన్నికల బరిలో మహిళ రిజర్వేషన్లు కలిసిరాని చోట పురుషులు నిలుచోగా భర్తల గెలుపు కోసం వారి భార్యలు ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో ఉండే మహిళా సంఘాల సభ్యుల ఇళ్లకు వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

● పొలం గట్లపై సిట్టింగ్‌లు

పల్లెల్లో సర్పంచ్, వార్డు స్థానాల బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు డబ్బు, మద్యంపై ప్రధాన దృష్టి పెడుతున్నారు. గ్రామ శివారులోని పొలం గట్ల వద్ద, వేప చెట్ల వద్ద సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి ఓటర్లను మచ్చిక చేసుకుంటున్నారు. పురుషులకు మద్యం ఆశ చూపుతుండగా మహిళలకు డబ్బులను అందజేస్తున్నారు. కుటుంబ సభ్యులందరికి చికెన్, మటన్ పంపిణీ చేస్తున్నారు. అభ్యర్థులు తమ గెలుపు కోసం లక్షల్లో ఖర్చు పెట్టడానికి వెనుకాడడం లేదు. పంపకాల వేళ అభ్యర్థులు తమకు ఓట్లు వస్తాయో రావోనన్న సందేహంతో ఓటర్లకు మద్యం, డబ్బులు ఇస్తున్న వేళ ప్రమాణాలు చేయించుకుంటున్నారు.

● టిఫిన్, టీ ఇప్పిస్తూ..

నామినేషన్ ఉపసంహరణ ఘట్టం ముగియడంతో ఆయా గ్రామాల వారిగా బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామాల్లో విస్తృత ప్రచారం కొనసాగిస్తున్నారు. గ్రామంలోని చౌరస్తాల వద్ద ఉన్న టిఫిన్ సెంటర్ల వద్ద టిఫిన్ చేయిస్తూ, టీ తాగిస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. మరో వైపు పొలం పనులకు వెళ్లే వారికి ఏమైనా సహాయం కావాలా చెప్పు అంటూ అప్యాయంగా పలకరిస్తున్నారు. వృద్ధ ఓటర్లను ఆకర్షించేందుకు మరింత లోతైన ప్రచారం జరుగుతుంది. ఖాతాల్లో జమైన పింఛన్ డబ్బులు తెచ్చుకునేందుకు బ్యాంకుకు వెళ్లే వృద్ధ ఓటర్లకు ప్రత్యేకంగా వాహన సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

చిన్న గ్రామాల్లో పెద్ద పంచాయితీ

- తక్కువ ఓటర్లు చోట ఎక్కువ మంది అభ్యర్థులు

తిమ్మాపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది. మండలంలో 23 గ్రామ పంచాయితీలు ఉన్నారు. అత్యంత తక్కువ మంది ఉన్న ఓటర్లు ఉన్న గ్రామం లక్ష్మీదేవిపల్లి. గ్రామంలో 208 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈ గ్రామంలో ఇద్దరు అభ్యర్థులు సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. ఈ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ ఓటర్లు లేరు. బీసీ ఓటర్లు 34 మంది మాత్రమే ఉండగా మిగత వారు జనరల్ ఓటర్లు. రాంహనుమాన్‌నగర్‌లో 328 మంది ఓటర్లు ఉండగా ఈ గ్రామంలో ఆరుగురు సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలుచున్నారు. జుగుండ్లలో 484 మంది ఓటర్లు ఉండగా ముగ్గురు, నర్సింగపూర్ గ్రామంలో 495 మంది ఓటర్లు ఉండగా ఇద్దరు పోటీ పడుతున్నారు.

బాలయ్యపల్లిలో 582 మంది ఓటర్లు ఉండగా ఎనిమిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మండలంలోని పొరండ్లలో సర్పంచ్ పదవికి పోటీకి అత్యధికంగా 10 మంది బరిలో ఉన్నారు. ఇక్కడ 2,285 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో ఎక్కువ ఓటర్లు ఉన్న తిమ్మాపూర్ మండల కేంద్రంలో 3,585 ఓటర్లు ఉంటే ఐదుగురు, రామకృష్ణకాలనీలో 3,288 ఓటర్లు ఉండగా ఆరుగురు, పర్లపల్లిలో 3257 మంది ఓటర్లు ఉండగా నలుగురు సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ఆశీర్వదించండి..అభివృద్ధి చేస్తా..

- మానకొండూర్ సర్పంచ్ అభ్యర్థి జవ్వాజి శ్రీలత మహేందర్


ప్రచారం చేస్తున్న జవ్వాజి శ్రీలత మహేందర్

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే మానకొండూర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి జవ్వాజి శ్రీలత మహేందర్ అన్నారు. మానకొండూర్‌లో మహిళలు, యువకులతో కలిసి ఆమె బుధవారం ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ పేపర్‌లోని మూడో నంబరు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తన భర్త మహేందర్ సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తాను సర్పంచ్‌గా గెలిస్తే ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణం, తాగునీటి కొరత లేకుండా చూస్తానని తెలిపారు. గ్రామంలో కోతుల బెడద లేకుండా చేస్తానని, వైకుంఠ రథం, ఫ్రీజర్ ఏర్పాటు చేస్తానన్నారు. డ్రైనేజీలు, మురికి కాల్వల నిర్మాణం చేపట్టి, ప్రతి 15 రోజులకోసారి మురికి కాల్వలలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తానని హామీ ఇచ్చారు. వీధి దీపాల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల సుందరీకరణ, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి పచ్చదనం-పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇస్తానన్నారు. తనను గెలిపిస్తే ఐదేళ్లలో గ్రామ అభివృద్ధికి కష్టపడి పని చేస్తానని ఆమె తెలిపారు.

బాండ్ పేపర్లపై హామీలు



గన్నేరువరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలంటే ఇప్పటి వరకు మాటల్లోనే, సభల్లోనే వినిపించేవి. ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. సర్పంచ్, వార్డు సభ్యుల బరిలో ఉన్న పలువురు అభ్యర్థులు తమ వాగ్దానాలను మాటల్లో కాదు.. బాండ్ పేపర్లపై రాసి గ్రామస్థులకు అందిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బాండ్ పేపర్లపై హామీలతో అభ్యర్థులు ప్రచారం చేయడం చర్చనీయాంశంగా మారింది. మరికొందరు తాము ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తన పదవిని రద్దు చేయించేందుకు గ్రామస్థులకు హక్కును కల్పిస్తున్నట్లు బాండ్ పేపర్‌లో పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా యువ అభ్యర్థులు ఈ బాండ్ పేపర్ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో బాండ్ పేపర్లు షేర్ చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

భగత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. కౌంటర్లను పరిశీలించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం తనిఖీ చేసుకోవాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని పరిశీలించారు. రూట్, జోనల్, నోడల్ అధి కారులు అప్రమత్తంగా ఉంటూ ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీపీవో జగదీశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎలగందల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరి మృతి


రాజయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని జాఫర్‌ఖాన్ పేటలో జరిగింది. గ్రామానికి చెందిన చీదురు రాజయ్య(50) ఇందిరమ్మ ఇళ్ల కట్టుకోవడం కోసం మండలంలోని ఇదిలాపూర్ గ్రామానికి చెందిన అల్లం రమేష్ ట్రాక్టర్‌తో మట్టి తరలిస్తున్నాడు. గతనెల 23నఇంటి నిర్మాణానికి మట్టి తరలిస్తుండగా అల్లం రమేష్ కుమారుడు అల్లం శేష్ కుమార్ ట్రాక్టర్ నడుపుతూ చీదురు రాజయ్యను ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలైన రాజయ్యను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ రాజయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరితోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామానికిచెందిన గోపిడి హన్మక్క(82) అనేవృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ చిరంజీవి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగురోజుల క్రితం హన్మక్క గ్రామంలో తనఇంట్లో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో హన్మక్కకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె మృతిచెందింది. హన్మక్క అల్లుడు హన్మంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణానికి చెందిన కటుకం శరత్ చంద్ర(39) అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులతో కరీంనగర్ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న శరత్‌చంద్ర మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా పని చేస్తున్నాడు. దీంతో పాటు బట్టల దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలతో అప్పులు పెరిగిపోయాయి. హుజూరాబాద్‌లో పని ఉందని మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరాడు. తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. స్వగ్రామం చొప్పదండిలోని ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు గుర్తించారు. శరత్ చంద్ర భార్య దివ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

ముస్తాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేరువేరుగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. మండలంలోని మోర్రాయిపల్లె గ్రామానికి చెందిన అకారం అరుణ్ వద్ద రూ.8వేల విలువ చేసే మద్యం, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన పాతూరి బాల్‌రెడ్డి వద్ద రూ 3వేల విలువచేసే మద్యాన్ని పట్టుకుని కేసునమోదు చేసినట్లు తెలిపారు.

వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనకాలగల కాలనీలో బొజ్జ శ్రీనివాస్ ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన మద్యంను బుధవారంరాత్రి ఎస్ఐరామ్మోహన్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.లక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

చందుర్తి: మండలం నర్సింగాపూర్‌లో బండి శ్రవణ్ కుమార్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యంను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు చందుర్తి ఎస్సై రమేష్ తెలిపారు. మొబైల్ పోలీస్ పార్టీ ఆధ్వర్యంలో 17బీర్లు పట్టుకున్నాట్లు పేర్కొన్నారు. మద్యం విలువ రూ.4000 వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

- గ్రామ ఓటర్లనే నియమించుకోవాలి
- వార్డుల్లో వార్డు ఓటరే ఉండాలి
- దొంగ ఓట్లను గుర్తించేది స్థానికులే..



హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల రోజు పోలింగ్ ఏజెంటే కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డుకు పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థి, ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఏజెంట్‌ను నియమించుకోవాలి. సదరు ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే కావడంతో సర్పంచ్‌గా పోటీ చేసే ప్రతి అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే అభ్యర్థి కీలకమైన వ్యక్తిని ఏజెంట్‌గా నియమించుకుంటేనే వారి గెలుపు సాధ్యమవుతుంది. సర్పంచ్ పదవికి పోటీ చేసే వ్యక్తులు ఏ వార్డు నుంచైనా వార్డు మెంబర్ అయితే ఏ వార్డు నుంచి పోటీ చేస్తున్నారో అదే వార్డుకు సంబంధించిన ఓటరును పోలింగ్ ఏజెంట్‌గా నియమించుకోవాలనే నిబంధన ఉంది. ఏదైనా కారణాల వల్ల ఇతరులను నియమించుకోవాల్సి వస్తే ముందే ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రాత పూర్వకంగా తెలియజేయాలి. దానిని పరిశీలించి అనుమతి ఇస్తే తప్ప ఇతరులను నియమించుకునేందుకు వీలు లేదు.

● ఏజెంట్ల వివరాలు రిటర్నింగ్ అధికారికి పంపాలి...

సర్పంచ్ అభ్యర్థి, వార్డు సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తి స్క్రూటినీ పూర్తి కాగానే ఏజెంట్‌గా నియమించుకునే వ్యక్తి అంగీకార పత్రాన్ని రాత పూర్వకంగా డూప్లికేట్ కాపీతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించాలి. పరిశీలన అనంతరం రిటర్నింగ్ అధికారి నియామక పత్రంపై ఆమోదం తెలుపుతూ సంత కం చేసి ఒక కాపీని ఏజెంట్‌కు అందజేస్తారు.

● కౌంటింగ్ ఏజెంట్ల నియామకం

ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో మొదట వార్డుల వారీగా కౌంటింగ్ ఏజెంట్లను నియమించి కౌంటింగ్ నిర్వహిస్తారు. కౌంటింగ్ ఏజెంట్ గా వచ్చేవారు ప్రభుత్వ ఉద్యోగి, పలు రాజకీయ పదవులు చేసిన వారు అనర్హులు. వీరిని తప్ప ఎవరినైనా ఏజెంట్లుగా నియమించుకోవచ్చు.

● ఓటర్లను గుర్తించేది ఏజెంట్లే...

ప్రతి వార్డులో ఆ వార్డుకు సంబంధించిన ఓటరు వచ్చినప్పుడు ఎన్నికల సిబ్బంది ముందుగా క్రమ సంఖ్యతో పాటు అతని పేరు సరి చూసుకున్న తరువాతనే ఓటరుకు వేలుపై ఇంక్ పెట్టి బ్యాలెట్ పేపర్ అందజేస్తారు. ఓటరుకు బ్యాలెట్ పేపర్ అందించిన తర్వాత ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేసినా ఎన్నికల అధికారి దానిని పరిగణలోకి తీసుకోరు. ఎవరైనా ఏజెంట్ అభ్యంతరం వ్యక్తం చేస్తే ప్రిసైడింగ్ అధికారి సమక్షంలో విచారణ జరిపిన తర్వాతే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

నోడల్ అధికారికి తీవ్ర గాయాలు


గాయపడిన నోడల్ అధికారి వినోద్‌కుమార్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద జడ్పీ సీఈవో, ఎన్నికల నోడల్ అధికారి వినోద్‌కుమార్ కింద పడగా తీవ్ర గాయాలపాలయ్యాడు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎన్నికల అబ్జర్వర్ రవికుమార్‌తోకలిసి వినోద్‌కుమార్ తిరిగి వెళుతుండగా సిమెంట్ దిబ్బకు తట్టుకొని కిందపడ్డాడు. దీంతో తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడేఉన్న వైద్యసిబ్బంది ప్రాథమికచికిత్స అనంతరం మెరుగైనచికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నోడల్ అధికారి వినోద్ కుమార్‌ను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ పరామర్శించి చికిత్స చేస్తున్న వైద్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. దీంతో వినోద్‌కుమార్ స్థానంలో వెంటనే వేములవాడ మండల నోడల్ అధికారిగా శ్రీనివాసరావును నియమించారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఒకరికి జరిమానా

పాలకుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన తీగల రాములు అనేవ్యక్తి బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు రామగుండం ఎక్సైజ్ సీఐ మంగమ్మ బుధవారం తెలిపారు. గతంలో పాలకుర్తి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్‌చేయగా, నిబంధనలు ఉల్లంఘించి నాటుసారా విక్రయించినందుకు జరిమానా విధించామన్నారు. ఎవరైనా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

ఆలయంలో దేవతా ప్రతిమలు దగ్ధం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామశివారులోని మల్లికార్జునస్వామి ఆలయంలో దేవతల ప్రతిమలు బుధవారం దగ్ధమయ్యాయని స్థానికులు తెలిపారు. స్వామివారి చిత్రపటాలతోపాటు పీటలు పూర్తిగా కాలిపోయాయని పేర్కొన్నారు. ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. దేవతలప్రతిమలు దగ్ధంపై అన్ని కోణాల్లో ఆరా తీస్తున్నామని పోలీసులు వివరించారు.

గుడిసె దగ్ధం

● రూ.20 వేల ఆస్తి నష్టం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్‌తండాలోని ఒడ్డెర కాలనీలో బత్తుల దేవవ్వకు చెందిన గుడిసె బుధవారం దగ్ధమైంది. గుడిసె సమీపంలోని పొలంలో ఓ రైతు కొయ్యకాళ్లకు నిప్పు పెడుతున్న క్రమంలో మంటలు వ్యాపించాయి. గుడిసెలోని దుస్తులు, ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. బత్తుల దేవవ్వ కుటుంబ సభ్యులు మరో గుడిసెలో ఉండడం వల్ల ప్రాణాపాయం తప్పినట్లయింది. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితురాలు దేవవ్వ పేర్కొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి రిమాండ్

● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లికి చెందిన మండలి నరేష్, నాగర్‌కర్నూలు జిల్లా మామిళ్లపల్లెకు చెందిన అతినారపు అలివేలు(38)ల మధ్య ఉన్న వివాహేతర సంబంధమే ఆమె హత్యకు దారి తీసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. బుధవారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్‌లతో కలిసి హత్యకేసు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు మండలి నరేష్ ఉపాధి కోసం తన భార్య పిల్లలతో కలిసి హైదారాబాద్ సుచిత్రలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసం ఉండేవాడు. సుమారు 5సంవత్సరాల క్రితం నిందితునికి మృతురాలు అతినారపు అలివేలుతో పరిచయం ఏర్పడింది. మృతురాలుకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబంలోని గొడవలతో ఆమె తన భర్తతో విడాకులు తీసుకున్నది. ఈ క్రమంలో ఆమెకు నరేష్‌తో ఏర్పడిన పరిచయం ఏర్పడింది. వీరి అక్రమ సంబంధం నిందితుడి భార్యకు తెలియగా, ఆమె సుమారు 2 సంవత్సరాల క్రితం తన తల్లి తండ్రుల వద్దకు వెళ్లి పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నది. ఈ క్రమంలో మృతురాలు తన భార్యపిల్లలను వదిలి తనను పెళ్లి చేసుకోవాలని నిందితున్ని తరుచూ ఇబ్బంది పెడుతుండేది. అంతే కాకుండా నిందితుని స్వగ్రామం స్తంభంపల్లికి వెళ్లి గొడవ చేస్తుండేది. కాగా 2024లో వీరిద్దరికీ డబ్బులు అవసరం ఉండగా మంచిర్యాలలో కూస లక్ష్మి అనే మహిళను ఇద్దరు కలిసి హత్యచేసి ఆమెవద్ద ఉన్న బంగారం దొంగిలించారు. హత్య కేసును చేధించిన మంచిర్యాల పోలీసులు వారిని అరెస్ట్ చేసి ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించారు. ఇద్దరు జైలు నుంచి మూడు నెలలక్రితం విడుదల అయ్యారు. మృతురాలు అలివేలు మంగళవారం స్తంభంపల్లి గ్రామంలోని నరేష్ ఇంటికి వచ్చి తనను పెళ్లి చేసుకోవాలని లేదంటే నాచావుకు మీరే కారణమని ఉత్తరం రాసి ఇంటి ముందు ఉన్న బావిలో దూకి చచ్చిపోతానని బెదిరించింది. దానితో నరేష్ ఎలాగైనా ఆమె అడ్డు తొలగించుకోవాలని అక్కడే ఉన్న రోకలిబండతో అలివేలు తలపై బలంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఎస్సై ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి కేసును దర్యాప్తు చేపట్టారు. నిందితుడు మండలి నరేష్‌ను ధర్మపురి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచి రిమాండ్‌కు తరలించారు.

ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం నాయకుల నిరసన

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సంక్షేమసంఘం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి మాట్లాడుతూ దేశ జనాభాలో సుమారు 63శాతం బీసీలు ఉన్నా నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. బీసీలకు42శాతం రిజర్వేషన్లను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ఈ బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యలో 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. బీసీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


న్యూఢిల్లీ జంతర్మంతర్‌లో నిరసన తెలుపుతున్న తెలంగాణ బీసీ నాయకులు

ప్రజా బాంధవుడిని కోల్పోయాం

● మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

● సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సమద్ నవాబ్ అంత్యక్రియలు


ఆవాల సరోజకు నివాళులర్పిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదముస్లింల పక్షపాతిని, ప్రజాబాంధవుడిని సమాజం కోల్పోయిందని మంత్రి శ్రీధర్‌బాబు, మాజీఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇదారా ఏ ఖాదిమానే మిల్లత్ సెక్రెటరీ అబ్దుల్ సమద్ నవాబ్ అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమద్ నవాబ్ మరణం కాంగ్రెస్‌పార్టీకి తీరని లోటన్నారు. పేదల అభిమానాన్ని చూరగొన్న నేతగా, సంఘ సంస్కర్తగా సమద్ నవాబ్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారన్నారు. కాంగ్రెస్ సమద్ నవాబ్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఇటీవల మరణించిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఆవాల సరోజ కుటుంబాన్ని పరామర్శించారు. సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

ధర్మపురి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లి ప్రమాదవశాత్తు మూడు నెలల క్రితం మృతి చెందిన గుర్రం సురేష్ మృతదేహం బుధవారం నేరెళ్ల స్వగ్రామానికి చేరుకుంది. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన గుర్రం సురేష్ జీవనోపాధి నిమిత్తం ఇరాక్ దేశానికి వెళ్లాడు. ఇరాక్‌లోని హేవ కంపెనీలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు సెప్టెంబరు 3న మృతిచెందాడు. మూడునెలల తరువాత మృతదేహం స్వగ్రామానికి చేరుకోగా శవపేటికపై పడి కుటుంబసభ్యులు బోరున విలపించారు. దహన సంస్కారాలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతురులు, తల్లి ఉంది. మృతదేహం రావటానికి ఎంబసీ అధికారులు, రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ అధికారులు, ఎన్నారై అధికారులు సహకరించారు. ఇందుకోసం సహకారం అందించిన మంత్రి, అధికారులకు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధికార ప్రతినిధి, న్యాయవాది జాజాల రమేష్ తెలిపారు.

అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల స్వైర విహారం

● గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడి


కుక్కకాటుకు గురైన చిన్నారి

జ్యోతినగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణ కాలనీలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బుధవారం గంట వ్యవధిలోనే ఐదుగురిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. కుక్కల దాడిలో ఈదునూరి బానేష్, ఈదునూరి భాగ్య, గోషిక దుర్గమ్మ, పెగడపల్లి రుద్ర, నర్మదకు గాయాలయ్యాయి. కొంతకాలంగా అన్నపూర్ణకాలనీలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, మున్సిపల్‌అధికారులకు ఎన్నిమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని సీపీఎం నాయకులు రామాచారి, గీట్ల లక్ష్మారెడ్డి ఆరోపించారు. తక్షణమే మున్సిపల్ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నపూర కాలనీలో పిచ్చికుక్కల బారి నుంచి ప్రజలను రక్షించాలని వారు రామగుండం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌ను కోరారు.

ప్రమాదకరంగా డివైడర్లు..

● తరచూ రోడ్డు ప్రమాదాలు ● సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్


కోరుట్ల బస్టాండులో ప్రమాదకరంగా ఉన్న డివైడర్



రోడ్డు ఇరుకుగా ఉండడంతో డిసెంబరు 2న డివైడర్‌ను ఢీకొట్టిన కారు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపం నుంచి తెలంగాణ చౌక్ వరకు ఉన్న డివైడర్‌లు ప్రమాదకరంగా మారాయి. చందుర్తి, మల్లారం నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాదారులకు స్వాగతం పలికే కమాన్ సమీపంలో డివైడర్ ప్రారంభం అవుతుంది. డివైడర్ ప్రారంభంలో ఎలాంటి సూచిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో డివైడర్ ఉందని వాహనదారులకు కనిపించకపోవడంతో డివైడర్‌ను ఢీకొంటున్నారు. వాహనదారులు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని, సంబంధిత అధికారులు వెంటనే చీకట్లో వాహనదారులకు కనిపించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు, స్థానిక వ్యాపారులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం రోడ్డు సంఘటనలు..

వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు సమీపంలోని డివైడర్ ప్రారంభం వద్ద ప్రతి నిత్యం వాహనాలు డివైడర్‌ను ఢీకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలకు డివైడర్ కనిపించకపోవడంతో వేగంగా డివైడర్‌ను ఢీకొడుతున్నారని దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. రోడ్డుపైన ఏర్పాటు చేసిన డివైడర్‌లు సైతం పక్కకు జరిగి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి..

- అక్కనపల్లి వివేక్‌రెడ్డి, వేములవాడ



కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు ప్రమాదకరంగా డివైడర్‌లు ఉన్నాయి. రోజు ఒక సంఘటన జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు వాహనదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలి.

పార్వతీపురంలో నాగుపాము కలకలం


పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ జగదీశ్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ రాజన్న వసతిగదులైన పార్వతీపురం వద్ద బుధవారం భారీ నాగుపాము ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. కొంతకాలంగా వినియోగంలో లేని వసతి గదిని తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు అందులో వస్తువులను తొలగిస్తుండగా ఐదు అడుగుల నాగు పాము ప్రత్యక్షమైంది. వెంటనే ఆలయ పర్యవేక్షకులు శ్రీకాంత్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎడ్లశివ స్నేక్‌క్యాచర్ జగదీష్‌కు సమాచారం అందించడంతో ఆయన చేరుకొని నాగుపామును పట్టుకొని బయట వదిలేశాడు.

చివరి మజిలీకి తప్పని తిప్పలు

● బ్యాక్ వాటర్‌లోనే అంత్యక్రియలు


రుద్రవరంలో నీటిలోనే అంత్యక్రియలు చేస్తున్న గ్రామస్థులు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో చివరి మజిలీకి సైతం తిప్పలు తప్పడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం గ్రామానికి చెందిన ముదం నర్సయ్య అనే వృద్ధుడు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. రుద్రవరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మించిన శ్మశాన వాటికలోకి మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్ చేరడంతో అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సయ్య మృతదేహంతో నీటిలోనే అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఏపీపీ రాత పరీక్షను వాయిదా వేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాతపరీక్షను వాయిదా వేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్రప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది ముక్కెరరాజు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల14న ఏపీపీ రాత పరీక్షరోజున రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఉన్నాయని, అదేరోజు ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంట, తిరిగి మధ్యాహ్న 2:30నుంచి సాయంత్రం 5:30గంటల వరకు తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఏపీపీ రాత పరీక్షలను నిర్వహిస్తోందన్నారు. ఏపీపీ రాత పరీక్షకేవలం హైదరాబాద్‌లోనే నిర్వహిస్తుండడంతో గ్రామీణప్రాంత న్యాయవాదులు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతున్నారన్నారు. ఓటు అనేది భారత రాజ్యాంగం కల్పించినహక్కు అని,సద్వినియోగం చేసుకునేందుకు బోర్డుపునరాలోచన చేయాలని కోరారు.

బైండోవర్

మల్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీఎన్నికల నేపథ్యంలో మండలంలోని 24మంది బెల్ట్‌దుకాణాల నిర్వాహకులను బైండోవర్‌చేశారు. మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొంటూ ఎక్సైజ్ అధికారులు వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.



ఓటుకే ప్రాధాన్యం

- నిబంధనలు పాటిస్తేనే మేలు
- ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు

జగిత్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

● జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుం టే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి.

● వీరికే అనుమతి

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరు తో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

● టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● నిబంధనలు పాటించాల్సిందే..

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్ని కల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు భద్రత సిబ్బందికి సహకరించాలి. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రామాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువపత్రాలలో ఏదైనాఒకటి తీసుకెళ్తే ఓటువేసేందుకు అవకాశం ఉంది.

● సందేహాలు ఉంటే పీఓకు ఫిర్యాదు చేయాలి

ఓటరుకు ఏమైనా అనుమానాలు సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి (పీఓ)కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్య వేక్షించి రెండు గంటలకొకసారి నమోదైన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలి



ఎస్‌యూలో ఎత్నిక్ డేలో పాల్గొన్న ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మన ఆచార వ్యవహారాలను కాపాడుకోవాలని సంస్కృతీ సంప్రదాయాలే మూల స్తంభాలని ఎస్‌యూ వీసీ ఉమేష్‌కూమార్ అన్నారు. బుధవారం యూనివర్సిటీ కామర్స్ కళాశాలలో ఎత్నిక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వాణిజ్య, వ్యాపార కళాశాల ఏటా కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. జాతి గౌరవాన్ని పెంపొందించే ఆచారాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వీసీ ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, వాణిజ్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7400 పలికింది. బుధవారం మార్కెట్‌యార్డుకు 62మంది 446క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.6900 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రాజు పర్యవేక్షించారు.

రహదారి ఆక్రమణపై రైతుల రాస్తారోకో



గ్రామస్థులతో చర్చిస్తున్న పోలీసులు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెల్లుల్ల రోడ్డు నుంచి వ్యవసాయ పనులు, మల్లెతోటలకు వెళ్లే రహదారి ఆక్రమించారని పేర్కొంటూ బుధవారం రైతులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీనిపై స్పందించిన పోలీసులు అక్కడికి వచ్చి ఎన్నికల అనంతరం దీనిపై చర్చించుకుందామని వారిని సముదాయించి హామీ ఇవ్వడంతో రైతు నిరసన విరమించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మల్లెతోటకు వ్యవసాయ పనులకు దారి ఉండేదని, దానిని కబ్జా చేయడంతో సుమారుగా 300మంది రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల అక్రమంగా లింకు రోడ్డు కబ్జాకు గురైందని, ప్రవాహం లేని ఎస్సారెస్పీ డీ32ను రోడ్డుగా అభివృద్ధిచేయాలని, సైనో1094లో గల మేఘనా వెంచర్‌లోని 40 ఫీట్ల రోడ్డు నుంచి మల్లెతోట వరకు రోడ్డు అభివృద్ధి చేసి తమకు రవాణా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంగు గంగాధర్, మాజీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, సంఘం అధ్యక్షుడు పూదరి సుధాకర్ గౌడ్, అరిసెల రమేష్, బొడ్ల సాగర్, రామకృష్ణ, ఆకుల ప్రవీణ్, రవి, అంజయ్య గాజా రాజారెడ్డి, రాహుల్, సంగు ప్రతిప్, అంజాగౌడ్, గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులు

వేములవాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండు నుంచి తెలంగాణ చౌక్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇండ్లల్లోని ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మతులో భాగంగా కాంట్రాక్టరు రోడ్డుకు ఇరువైపుల ఎక్సకవేటర్ సహాయంతో మట్టిని తొలగించారు. దీంతో రోడ్డు పక్క నుంచి ఇండ్లల్లోకి వెళ్లే మిషన్ భగీరథ పైపులు తెగిపోయాయి. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై సువరుగా 15 రోజులు అవుతున్న పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులు, వ్యాపారులకు మిషన్ భగీరథ నీరు అందక, రోడ్డు తవ్వి వదిలేయడంతో ఇంట్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో గురుకుల బాలికల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుచిత్ర

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ 17,19విభాగాల్లో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో జగిత్యాల జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సుచిత్ర తెలిపారు. ఫుట్ బాల్ బీచ్ వాలీబాల్‌లో 10వతరగతి విద్యార్థి అమీనా, అండర్-19 విభాగంలో కో-కో పోటీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న స్ఫూర్తి, అసోసియేషన్ కబడ్డీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువు తున్న షబానా ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆమె తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుచిత్ర, పీడీ శ్రీవిద్య, పీఈటీ రమాదేవితో పాటు ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాగాయపల్లి గ్రామస్థులకు నీటి తిప్పలు

- మిషన్ భగీరథ నీరు రాక ప్రజల కష్టాలు



వాటర్ ట్యాంకర్‌తో నీటిని నింపుకుంటున్న గ్రామస్థులు

వేములవాడ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ నీరు రాక నాగాయపల్లి గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాగాయపల్లి గ్రామంలో కొన్నిరోజులుగా మిషన్ భగీరథనీరు అందక ప్రజలు నీటితిప్పలు ఎదుర్కొంటున్నారు. తాగునీటికి, ఇంటి అవసరాలకు వాటర్ ట్యాంకుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. పంటపొలాల్లో ఉన్న బోర్ల ద్వారా నీటిని తెచ్చుకొని అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు అందకుండా నీటికి కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికి అధికారులు స్పందించడం లేదని, గ్రామంలో ఉన్న 3 బోరుబావులు నిరుపయోగంగా ఉన్నాయని వాటని సైతం పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యవిధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలి



సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీజీఎంఈయూ సభ్యులు

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్‌ను తక్షణమే రద్దు చేయాలని, దాని స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌సర్వీసెస్‌ను ఏర్పాటుచేయాలని ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం యూనియన్ నాయకులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలోని ఉద్యోగులు సామూహికంగా సంతకాల సేకరణ చేపట్టి ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూ 1986లో ఏర్పాటైన వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించకపోవడం, వేతన సవరణ సంఘానికి (పీఆర్సీ) వినతులు సమర్పించే అవకాశం లేకపోవడం, ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించకపోవడం వంటి కారణాలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సులోచన, సునీత, శోభ, జమున, జ్యోతి, స్నేహ, సుజాత, మమత, శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వాణిజ్య పన్నులశాఖలో పనిచేస్తున్న ఏసీటీవోలకు డీసీటీవోగా పదోన్నతులు కల్పించాలని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. బుధవారం తెలంగాణ వాణిజ్యపన్నులశాఖ రాష్ట్రకమిషనర్ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖాళీగాఉన్న డీసీటీవోపోస్టుల్లో ఏసీటీవోలకు ప్రమోషన్లు ఇస్తే రాష్ట్రప్రభుత్వ ఖజానాకు ప్రొఫెషనల్‌టాక్స్ రావడానికి అవకాశం ఉందన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



అవార్డును అందుకుంటున్న పున్నం చందర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన పలువురి ఉత్తమ సేవలకు అవార్డులు వచ్చాయి. బుధవారం హైదరాబాద్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజె అబ్దుల్‌కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో గత 15సంవత్సరాలుగా సైకాలజిస్టుగా ప్రజలకు, కార్మికులకు విశేషసేవలు అందిస్తున్న సైకాలజిస్ట్ కనుకుంట్ల పున్నంచందర్ బెస్ట్‌సర్వీస్‌అండ్ సైకాలజిస్ట్ అవార్డుకు ఎంపికయ్యాడు. అదేవిధంగా హెల్పింగ్ హార్ట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తున్న అల్వాల ఈశ్వర్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా వైస్ చైర్మన్ గడ్డం దివాకర్ ఉత్తమ సామాజిక సేవ అవార్డులకు ఎంపికయ్యారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిలర్ జాతీయ అధ్యక్షుడు కొప్పుల విజయ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ హనుమాగౌడ్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కన్వీనర్ గాజుల వేణుకుమార్, రాష్ట్ర ఉమెన్ వింగ్ డైరెక్టర్ గజ్జెల కరుణ అవార్డులను ప్రదానం చేసి అభినందించారు.

'నవోదయ' ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

చొప్పదండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఈ నెల 13న నిర్వహించే నవోదయ 6వ తరగతి ప్రవేశపరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 34పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు.

భవిష్యత్ తరాలకు బాటలు వేస్తున్న సీఎం: చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలకు బాటలు వేసే ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలిచిపోతారని, విద్య, వైద్యం ఉపాధి అవకాశాలపై విజన్ ఉందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని పార్టీ కార్యాలయంలో బుధవారంవిలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి జరగాలంటే వనరులన్నింటినీ ఉపయోగించుకోవాలన్నారు. తెలంగాణలో మొదటి నుంచి భూ సమస్య ఉందన్నారు. రైజింగ్ తెలంగాణ 2047గ్లోబల్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విషయాలను పొందుపరిచారని, జల్ జంగల్ జమీన్ కొమరంభీం ప్రస్తావన చేయడం, భూమి కోసం భుక్తి కోసం విముక్తికోసం జరిగిన పోరాటంలో వేలాదిమంది అమరత్వం పొందినట్లు చెప్పారన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా మాట్లాడ లేదని, సామాజిక అంశాలపై లోతుగా అధ్యయనం చేశారని అన్నారు. విద్య వైద్యంపై సంపూర్ణ అవగాహన కలిగి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచేందుకు గ్లోబల్ సమ్మిట్ ఉండాలని ముందు చూపుతో వ్యవహరించిన సీఎంను అభినందిస్తున్నామని అన్నారు. స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి నిధులు విడుదల కాలేదని, దాదాపుగా 4వేల కోట్ల రూపాయలు రావాల్సి ఉందని అన్నారు. కొంత ఆలస్యంగానైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఎన్నికల్లో సీపీఐ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్,గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి మధ్య రోడ్డు పక్కన ఉన్న బావి

మానకొండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్-జగ్గయ్యపల్లి గ్రామాలమధ్య రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. మానకొండూర్-వేగురుపల్లి ప్రధాన రహదారిపై మూల మలుపు ఉండడమే కాకుండా రోడ్డును ఆనుకొని వ్యవసాయ బావి ఉంది. ఈ రహదారి వెంట వేగురుపల్లి, లక్ష్మీపూర్, వెల్ది, లింగాపూర్, జగ్గయ్యపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో కరీంనగర్‌కు వెళ్తారు. వందలాది ఇసుక ట్రాక్టర్లు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు నడుస్తూనే ఉంటాయి. బావి వద్ద పెద్ద వాహనాలు ఎదురుగా వస్తున్న సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించడానికి సూచికలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమ్మక్క భక్తులకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయానికి వచ్చే సమ్మక్క, సారలక్క జాతర సందర్భంగా వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ భీమన్న ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆలయ అధికారులతో కలిసి విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో రద్దీ పెరిగినందున అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఉచిత దర్శనం, కోడెల క్యూలైన్, కళ్యాణ కట్ట, వివిపి రోడ్డు, తదితర క్యూలైన్‌లను పరిశీలించారు. ప్రధానంగా తాగునీటి సదుపాయం, సైన్‌బోర్డులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, మూత్ర శాలలు, స్నానాల గదులు, లైటింగ్ సదుపాయాలు, ఫ్యాన్లు, సీసీకెమెరాలు, డిజైన్స్, సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమ్మక్క జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడు తొలి విడత పోలింగ్
- కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది





పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే

కరీంనగర్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో గురువారం నిర్వహించనున్న తొలి విడత పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. బుధవారం ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్స్‌లను కరీంనగర్ మండల పరిషత్ నుంచి తరలించారు. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీల్లో 14 సర్పంచ్, 132 వార్డులకు 32 వార్డులు ఏకగ్రీవమవగా 100 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ స్థానాలకు 57 మంది, వార్డులకు 246 మంది బరిలో ఉన్నారు. ఇందుకోసం మండలంలో 132 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యలయంలో డిస్ట్రి బ్యూషన్ కేంద్రాల్లోని ఏర్పాట్లను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఎన్నికల సామగ్రిని తనిఖీ చేసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి ఉన్నారు.

గంగాధర: గంగాధర మండలంలో 33 సర్పంచ్ స్థానాలకు 138 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మండలవ్యాప్తంగా 296 వార్డులుండగా 102 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 194 వార్డులకు 583 మంది పోటీ పడుతున్నారు. గంగాధర ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్నికల రాష్ట్ర అబ్జర్వర్ వెంకటేశ్వర్ డిస్ట్రిబ్యూటర్ కేంద్రాన్ని పరిశీలించారు. 355 పీవోలు, 355 మంది ఏపీలు విధులు నిర్వహిస్తున్నారు.

- **విధులు పకడ్బందీగా నిర్వహించాలి**

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం గంగాధర మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్ గీత దాటి ఎవరూ ప్రచారం నిర్వహించకుండా విధులు నిర్వహించాలన్నారు. గంగాధర మండలంలో ఇద్దరు ఏసీపీలు, 5 సీఐలు, 12 మంది ఎస్సైలు, 300 మంది పోలీసు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- **డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన**

చొప్పదండి: చొప్పదండిలో జడ్పీ ఉన్నత పాఠశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సామగ్రిని చెక్‌లిస్టు ప్రకారం తనిఖీ చేసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

- **పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది**

భగత్‌నగర్: మొదటి విడత జరగనున్న పంచాయతీ ఎన్నికలకు కొత్తపల్లి మండలంలో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలి వెళ్లారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని తీసుకున్న సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కొత్తపల్లి మండలంలో ఆరు గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని గ్రామాలకు అధికారులు బస్సులను ఏర్పాటు చేశారు.

- **అభ్యర్థుల్లో టెన్షన్**

గంగాధర : గంగాధర మండలంలో గురువారం సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు. 33 గ్రామ పంచాయతీల్లో 44163 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించకోనున్నారు. మండల వ్యాప్తంగా పురుష ఓటర్లు 21395,మహిళ ఓటర్లు 22766 ఉన్నారు. నిన్నటి వరకు సమరానికి సై అన్నట్టుగా ప్రచారం నిర్వహించగా పోలింగ్ సమయం దగ్గర పడడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ఓటరు ఎవరికి పట్టం కట్టనున్నారోనని ఆందోళన నెలకొంది.

తొలి విడత ఎన్నికలు నేడే

(5వ పేజీ తరువాయి)

33 పంచాయతీ లకు చెందిన 33 సర్పంచు పదవులు, 296 వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

రామడుగు మండలంలోని 23 పంచాయతీల్లో శ్రీరాములపల్లి సర్పంచ్ ఏకగ్రీవమైంది. 22 సర్పంచ్, 222 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి.

- చొప్పదండి మండలంలోని 16 పంచాయతీల్లో దేశాయిపల్లి, పెద్దకురమపల్లి సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. 14 సర్పంచ్, 154 వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

- కొత్తపల్లి మండలంలోని ఆరు పంచాయతీల సర్పంచ్, 62 వార్డులకు, కరీంనగర్ రూరల్ మండలంలోని 14 గ్రామపంచాయతీలకు చెందిన సర్పంచ్, 132 వార్డు పదవులకు ఎన్నికలు జరుగుతాయి.

- **ఉదయం 7 నుంచి పోలింగ్**

ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 858 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామాగ్రితో బుధవారం రాత్రి వరకు చేరుకున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో టెంట్లు, మంచినీటి వసతి, దివ్యాంగుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారందరికి ఓటు హక్కు కల్పిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లను లెక్కిస్తారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే సర్పంచ్, వార్డుసభ్యుల ఫలితాలను వెల్లడించారు. ఆ తర్వాత వార్డు సభ్యుల్లో ఒకరిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకుంటారు.

అచీవర్స్ పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

గణేశ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోతిరాంపూర్ లోని అచీవర్స్ ఆక్టివ్ పాఠశాల 4,5వ తరగతుల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం నగరంలోని ఇండస్ట్రియల్ పార్క్‌ను సందర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి మాట్లాడుతూ పాఠ్యాంశంలో భాగంగా పరిశ్రమల సందర్శన చేపట్టినట్లు, వివిధ అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం నెహ్రూ జియోలాజికల్ మ్యూజియం సందర్శించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో విజన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో విజన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో జి. వర్షిత్, వి.ప్లూచందర్, సీహెచ్ హర్షిత్ బహుమతులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఇన్‌చార్జి ప్రతిభ, అబాకస్ ఉపాధ్యాయిని అనూష అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ట్రినిటి విద్యార్థి

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు నిర్వహించనున్న 69వ ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ట్రినిటి కళాశాల విద్యార్థి జిట్టబోయిని సుధీష్ణ ఎంపికైనట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సుధీష్ణను కళాశాల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి అభినందించారు.

బోగంపాడు సర్పంచ్‌కు బీజేపీ శ్రేణుల సన్మానం

ఇల్లందకుంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలం బోగంపాడు గ్రామ సర్పంచ్ అభ్యర్థి అలేటీ నిర్మల-రఘుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికవడంతో బుధవారం బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నర్ర భూంరెడ్డి పాల్గొన్నారు.

పండుగ సాయన్న వర్ధంతి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బహుజన వీరుడు పండుగ సాయన్న వర్ధంతిని ప్రజా సంఘాల నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సమ్మయ్య, సాగర్, శంకర్, బాబు, రత్నం, లక్ష్మణమూర్తి, ఖలీద్‌హుస్సేన్, రమేష్, శ్రీనివాస్, భిక్షపతి, ప్రవీణ్, నారాయణ, శ్రీనివాస్, మనోజ్, కుమార్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అవినీతి నిర్మూలన దినోత్సవం, మానవహక్కుల దినోత్సవంలో భాగంగా నగరంలోని సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై బుధవారం వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు సాగర్, సంస్థ ప్రతినిధి తిరుపతి, ప్రధానాచార్యుడు రాజమౌళి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు

కరీంనగర్ రూరల్; డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సర్పంచ్, వార్డు సభ్యుల ఫ్లెక్సీలను తొలగించారు. బుధవారం రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం అన్ని గ్రామాల్లో తనిఖీ చేసింది. గ్రామాల కూడళ్లలో ఉన్న అభ్యర్థుల ప్రచారం ఫ్లెక్సీలను తొలగించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. గ్రామంలో ఎక్కడా అభ్యర్థుల ఫొటోలు ఉన్న ఫ్లెక్సీలు ఉండ కూడదని సూచించారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా తేజస్వీ ప్రకాష్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గానికి చెందిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ పెద్దెల్లి తేజస్వి ప్రకాష్‌ను కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియామకమయ్యారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పెరిక కుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చంద్రశేఖర్, వెంకన్న

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెరిక కుల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కరీంనగర్‌కు చెందిన గాండ్ల చంద్రశేఖర్, బస్వ వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో జిల్లా పెరిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నిక నిర్వహించారు. పెరిక కుల కుటుంబ సమగ్ర డిజిటల్ సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రారంభించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్, అసోసియేట్ అధ్యక్షుడు సుంకరి ఆనంద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కీత విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్‌కు పరామర్శ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ తండ్రి మెండి శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడి బుధవారం పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పార్టీ నాయకులతో కలిసి చంద్రశేఖర్‌ను పరామర్శించారు.

లక్ష్మణ్‌రావుకు శాస్త్ర భజన మండలి అభినందన

సుభాష్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్‌శాఖ అడ్‌హక్ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నియామకమైన సంగెం లక్ష్మణ్‌రావును శాస్త్ర భజన మండలి బృందం అభినందించింది. బుధవారం టీఎన్‌జీవో పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్ నివాసంలో లక్ష్మణ్‌రావును సన్మానించారు. టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, గజవెల్లి బాలు, గురుస్వామి, ప్రసాద్‌రెడ్డి, బేతి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీ ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు, పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే ఉపాధ్యాయులకు ఎన్నిక జరిగిన తర్వాత రోజున ఆన్‌డ్యూటీ ఇవ్వాలని, ఈ నెల 12,15,18 తేదీల్లో స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని తపస్ జిల్లా శాఖ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు

● సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: స్థానిక అఖిల భారత మార్కండేయస్వామి దీక్షలను గురుస్వామి చిలుక నరసప్ప బుధవారం సూరత్ జనరల్ సమాజ్ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ పట్టణం మార్కండేయస్వామి ఆలయంలో ప్రదానం చేశారు.

చొప్పదండి: చొప్పదండి పట్టణానికి చెందిన కళ్లెం శ్రీనివాస్ రెడ్డికి డాక్టరేట్ లభించింది. గీతం విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన శ్రీనివాస్ రెడ్డి హైపవర్ర్‌లిక్ టామ్మెంట్ ఫ్లోలో కంప్యూటేషనల్ అనాలసిస్ అనే అంశంపై డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

శంకరపట్నం: శంకరపట్నం మండలంలోని కరీంపేట, మెట్‌పల్లి, ఆముదాలపల్లి, కాచాపూర్, కొత్తగట్టు, గొల్లపల్లి, చింతలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

తిమ్మాపూర్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తిమ్మాపూర్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని నుస్తులాపూర్‌లో బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

గణేశ్‌నగర్:ఎస్‌యూకు రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ ప్రకటనలో కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1000 కోట్లను కేటాయిస్తూ సీఎం రేవంత్ రెడ్డి జీవో విడుదల చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. సరిపడా నిధులు లేక పోవడంతో శాతవాహన విశ్వ విద్యాలయం అభివృద్ధికి నోచుకోవడం లేదని తెలిపారు.

అప్రమత్తతతోనే క్యాన్సర్ అదుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదని, ముందస్తు పరీక్షల ద్వారా అధిగమించవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలోని ఆల్ఫ్రెడ్ నోబెల్ పాఠశాలలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో మహిళ ఆరోగ్యం-క్యాన్సర్ స్క్రీనింగ్ పేరిట నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల జీవితాలకు ముప్పుగా పరిణమిస్తున్న క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తించి ముందస్తు చర్యలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ విషయంలో మహిళలు నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, క్యాన్సర్ నివారణ, ఆధునిక చికిత్సపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

హుజూరాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలని టౌన్ సీఐ కరుణాకర్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మూడో విడత పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిపై వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

ఇల్లందకుంట: సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో విడతలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియామవళిపై వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచించారు. తహసీల్దార్ దాసరి రాజమల్లు, ఎస్సై సదయ్య తదితరులు పాల్గొన్నారు.

సమద్ నవాబ్ మృతికి సంతాపం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సీనియర్ కాంగ్రెస్ నేత, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్, డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ సమద్ నవాబ్ మృతికి మంత్రి పొన్నం ప్రభాకర్ సంతాపం తెలిపారు. సమద్ నవాబ్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మంత్రి సానుభూతి తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిరాజ్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, ఇర్ఫాన్ హుస్సేనీపురలో నవాబ్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.

ఆడపిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

సుభాష్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పద్నాలుగేళ్లు పూర్తి చేసుకొని 15 సంవత్సరాలలోపు ఆడ పిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇవ్వాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకరమణ సూచించారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ, రిపోర్టింగ్ సూపర్‌వైజర్లతో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ ఎక్కువగా హ్యూమన్ పాపిలోమా వైరస్‌తో సంబంధం కలిగి ఉంటుందని తెలిపారు. జిల్లాలో 11వేల బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వాలని లక్ష్యంగా చేసుకొని వ్యాక్సినేషన్ చేయాలని అన్నారు. గర్భిణులు, మొదటి డోసు తీసుకున్నవారికి వేయకూడదని సూచించారు. ఎన్‌సీడీపీవో డాక్టర్ ఉమాశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, అడిషినల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధ, డీఐవో డాక్టర్ సాజిదా, ఎంహెచ్‌ఎల్ పీవో డాక్టర్ సనా జవేరియాతోపాటు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన అంజన్‌కుమార్



కమిషనర్‌ను సన్మానిస్తున్న అంజన్‌కుమార్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సీఎం అస్యూరెన్స్ కింద ప్రారంభించిన పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పూర్తి చేయాలని కోరారు. పట్టణంలో వీధి దీపాలు సమస్యపై చర్చించారు. పట్టణంలో ఉన్న నిరుపేదలకు డబుల్ రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు, ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ జాబితాలపై మాట్లాడినట్లు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని మల్కాపూర్ నుంచి బొమ్మకల్‌కు వెళ్లే డి94 కాలువలోని మురుగు నీరు, సిల్టు తొలగించాలని, డంప్ యార్డు సమస్యను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. మాజీ కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్, పడిశెట్టి భూమయ్య తదితరులు ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్ దేవేందర్‌కు సీపీ నివాళి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 9ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో సోమవారం మరణించిన కరీంనగర్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ ఎర్రోజు దేవేందర్(53) పార్థివ దేహం వద్ద సీపీ గౌస్ ఆలం బుధవారం నివాళులర్పించారు. కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలో దేవేందర్ నివాసంలో కుటుంబసభ్యులను పరామర్శించారు. ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్, ఆర్‌ఐ కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

తోడికోడళ్ల మధ్య హోరాహోరీ

తిమ్మాపూర్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తోడి కోడళ్లు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కొత్తపల్లి ఎస్సీ మహిళకు రిజర్వ్ అయ్యింది. ఇక్కడ ఆరుగురు సర్పంచ్ పదవి కోసం బరిలో నిలిచారు. వీరిలో గోదారి రాజమల్లు, గోదారి రవి సొంత అన్నదమ్ముల భార్యలు పోటీలో ఉన్నారు. గోదారి లక్ష్మి, గోదారి శోభారాణి నువ్వేనేనా అన్నట్లు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు తప్పనిసరి

సుభాష్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం కార్యాలయంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం, ఐసీటీసీ, పీపీటీసీటీ, డీఆర్‌సీ, ఏఆర్‌టీ, ఎస్‌ఎస్‌కే, టీఐ ఎన్‌జీవో, ఎల్‌డబ్ల్యూఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పరీక్షల్లో పాజిటివ్ వస్తే వారిని ఏఆర్‌టీ సెంటర్‌కు పంపించి ఉచితంగా మందులు ఇప్పించాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. బుధవారం కరీంనగర్ ముండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ కరీంనగర్ మండలంలోని మొత్తం 14 గ్రామపంచాయతీల్లో గురువారం నిర్వహించే పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. నగునూరు, చామనపల్లి, చెర్లబూత్కూర్, మొగ్దుంపూర్, చేగుర్తి గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలాన్ని ఆరు రూట్లుగా విభజించామని, ఒక్కో రూట్‌కు ఎస్సై, రెండు రూట్లకు సీఐలకు బాధ్యతలను అప్పగించామని తెలిపారు. ఏసీపీ ఎప్పటికపుడు పర్యవేక్షిస్తారన్నారు. నలుగురు సీఐలు, 8 మంది ఎస్సైలు, 80 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసీపీ శ్రీనివాస్, సీఐలు నిరంజన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, జాన్‌రెడ్డి, సదన్‌కుమార్ ఎస్సైలు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేకాధికారి పమేలా సత్పతి అన్నారు. బుధవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కోసం కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక దంత వైద్య శిబిరాన్ని కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రుద్రాంశ్‌విశ్వకు ఉజ్వల భవిష్యత్



బాలుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అతిచిన్న వయసుల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న రుద్రాంశ్‌విశ్వకు ఉజ్వల భవిష్యత్ ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌కు చెందిన రుద్రాంశ్‌విశ్వ (2 సంవత్సరాలు)386 వస్తువులు, రాష్ట్రాలు, దేశాల పేర్లు, శ్లోకాలు గుర్తించడంతో కలాం వరల్డ్ రికార్డ్స్ వారు ఎక్స్‌ట్రా ఆర్డినరీ గ్రాస్పింగ్ పవర్ జీనియస్ కిడ్-2025 అచీవర్ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా రుద్రాంశ్ విశ్వ తల్లిదండ్రులు మాధురి, శ్రవణ్‌కుమార్ ఎమ్మెల్యేను బుధవారం కలిశారు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి):ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్ అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ హక్కులను కాపాడుకోవడానికి చట్టాలు ఉన్నాయని తెలిపారు.

గణేశ్‌నగర్: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో మానవ హక్కులు, న్యాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు రంగయ్య పటేల్, చంద్రప్రకాష్ రెడ్డి, కిరణ్ కుమార్, పానెల్ న్యాయవాది రామాంజనేయులు అవగాహన కల్పించారు.

జమ్మికుంట:పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఓదెలు కుమార్ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ప్రకటించిన సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన ప్రాముఖ్యతను వివరించారు.